# ఎస్బీఐ బ్యాంకు స్కామ్‌లో రూ.13.71 కోట్లు స్వాహా



- అసలు సూత్రధారి క్యాషియర్
- మరో 9మంది ప్రమేయం
- ముగిసిన అధికారుల ఆడిట్

**శెనార్తి మీడియా, మంచిర్యాల/ చెన్నూరు:**

పట్టణంలోని ఎస్బీఐ-2 బ్రాంచ్‌లో క్యాషియర్ నరిగె రవీందర్ రూ.13.71 కోట్ల బంగారం, నగదు స్వాహా చేసినట్లు ఆడిట్‌లో తేలింది. శనివారం పూర్తి అయిన ఆడిట్ నివేదికలో ఈ విషయం బహిర్గతమైంది. రీజనల్ మేనేజర్ రితీష్‌కుమార్ గుప్తా వివరాల ప్రకారం 402 మంది ఖాతాదారులకు సంబంధించిన 20 కిలోల 490 గ్రాముల బంగారం, రూ.1,10,27,617 నగదు గల్లంతైనట్లు తేలింది. ఈ స్కామ్‌లో క్యాషియర్ రవీందర్‌తో పాటు మరో 9మంది ప్రమేయం ఉన్నట్లు బయటపడింది. లక్కాకుల సందీప్, కొంగండి దీరేష్, నరిగె సరిత, నరిగె స్వర్ణలత, ఉమ్మల సురేష్, కోదటి రాజశేఖర్, గౌడ సుమన్, యేసంపల్లి సాయికిరణ్, మోత్కూరి రమ్య పేర్లపై ఉన్న అకౌంట్లకు ఈ డబ్బు బదిలీ చేయబడింది. ఆ తరువాత 50మంది ఖాతాల ద్వారా మళ్లీ రవీందర్ ఖాతాకు చేరింది.

**అధికారుల వైఫల్యమే కారణం**

ఈ స్కామ్‌కు ప్రధాన కారణం అధికారుల నిర్లక్ష్యమేనని అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. గత సంవత్సరం అక్టోబరు నుండి ఆగస్టు 20 వరకు జరిగిన ఈ భారీ మోసాన్ని అధికారులు గుర్తించకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ప్రతి మూడు నెలలకు ఆడిట్ జరగాల్సి ఉండగా, రెండు సార్లు ఆడిట్ జరిగినా ఎటువంటి లోపం గుర్తించకపోవడం అనుమానాలు రేకెత్తిస్తోంది. గత జూన్‌లో అసిస్టెంట్ మేనేజర్ రవికుమార్ లెక్కలు సరిగ్గా ఉన్నట్లు నివేదిక ఇవ్వడం కూడా అనుమానాస్పదంగా మారింది.

**పది మందిపై ఫిర్యాదు**

క్యాషియర్ రవీందర్‌తో పాటు మరో తొమ్మిది మందిపై బ్యాంకు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రీజనల్ మేనేజర్ రితీష్‌కుమార్ గుప్తా, ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి పైసా, బంగారం రికవరీ చేస్తామని హామీ ఇచ్చారు. సీఐ దేవేందర్‌రావు మాట్లాడుతూ నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని తెలిపారు.

**పోలీసుల అదుపులో నిందితులు**

స్కామ్ సూత్రధారి రవీందర్‌తో పాటు పలువురు నిందితులు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కానీ బంగారం, నగదు ఎక్కడికి వెళ్లిందనే దానిపై విచారణ కొనసాగుతోంది. ఈ వ్యవహారంలో మరో 50 మంది ఖాతాదారుల ప్రమేయం ఉన్నట్లు కూడా తెలుస్తోంది. అందులో ప్రభుత్వ, కాంట్రాక్టు ఉద్యోగులు సైతం ఉన్నారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఏసీపీ విచారణ**

జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లుతో పాటు చెన్నూరు సీఐ దేవేందర్‌రావు, రూరల్ సీఐ బన్సీలాల్, ఎస్ఐలు దర్యాప్తు చేపట్టారు. శనివారం రాత్రి ఏసీపీ బ్యాంకులోని రికార్డులు, సీసీ కెమెరాలను పరిశీలించి విచారణను కొనసాగించారు.




## మలబార్ గోల్డ్ & డైమండ్స్ 'వ్యాన' కలెక్షన్

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ప్రతి మహిళా తనదైన ప్రత్యేకతను ప్రతిబింబించేలా మలబార్ గోల్డ్ & డైమండ్స్ రూపొందించిన నూతన రత్నాభరణాల సేకరణ 'వ్యాన' ఆవిష్కరించబడింది. మహిళల వ్యక్తిత్వం, అంతర్గత బలం, ఆత్మవిశ్వాసానికి ఇది ప్రతీకగా నిలుస్తుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. 18, 22 క్యారెట్ల బంగారంతో రూపొందించిన ఈ కలెక్షన్‌లో వజ్రాల మెరుపు, రంగురంగుల రత్నాల ఆకర్షణ ప్రత్యేకత. ఆధునిక శైలికి తగిన తేలికపాటి డిజైన్లు, ఫ్లూయిడ్ సిల్హౌట్‌లతో ఈ ఆభరణాలు రోజువారీ ఉపయోగానికి సౌకర్యవంతంగా ఉండేలా తీర్చిదిద్దబడ్డాయి. సంప్రదాయ–ఆధునిక సమన్వయంతో రూపొందిన ఈ కలెక్షన్ భారతీయ మహిళల జీవితానికి అద్భుతంగా సరిపోతుందని నిర్వాహకులు తెలిపారు. వ్యాన ఆవిష్కరణ సందర్భంగా మలబార్ చైర్మన్ మాట్లాడుతూ, "ఇది కేవలం ఆభరణాల సేకరణ కాదు, మహిళా స్ఫూర్తికి ప్రతినిధి" అని అన్నారు. ప్రతి ఆభరణం ధరించే వ్యక్తి ప్రత్యేకత, బలం, దయను ప్రతిబింబిస్తుందని వివరించారు. ఈ కలెక్షన్ ప్రచారానికి 'జస్ట్ లైక్ మీ' కాన్సెప్ట్‌ను రూపొందించారు. మలబార్ బ్రాండ్ అంబాసిడర్ శ్రీనిధి శెట్టి ఇందులో ప్రధాన పాత్రలో నటించారు. ఆక్వామెరిన్ ప్రశాంతత, పింక్ టోపాజ్ సౌందర్యం, ఎమరాల్డ్ శక్తి వంటి విలువలు మహిళల్లో ఉన్నతంగా ప్రతిఫలిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

**మహిళా ప్రత్యేకతకు ప్రతిరూపం**

**ప్రత్యేక ఆఫర్లు:** వ్యాన కలెక్షన్‌తోపాటు జరుగుతున్న జెమ్‌స్టోన్ జ్యువెలరీ ఫెస్టివల్‌లో రత్నాభరణాలు, అన్‌కట్ వజ్రాలపై తయారీ ఛార్జీలకు 25% వరకు తగ్గింపు లభిస్తుంది. ఈ ఆఫర్ సెప్టెంబర్ 7, 2025 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది.

**మలబార్ విశిష్టతలు:** ప్రపంచవ్యాప్తంగా 13 దేశాల్లో 400కి పైగా షోరూమ్లు నిర్వహిస్తూ, 15 మిలియన్లకు పైగా వినియోగదారుల విశ్వాసాన్ని పొందిన సంస్థ ఇది. పారదర్శక ధరల పట్టిక, జీవితకాల ఉచిత సేవలు, పాత బంగారానికి 100% మార్పిడి విలువ, HUID ధృవీకరణ, వజ్రాలకు 28 పాయింట్ల నాణ్యత తనిఖీ, కొనుగోలుకు ఏడాది ఉచిత బీమా వంటి సౌకర్యాలను అందిస్తోంది.

**సామాజిక బాధ్యత:** లాభాల్లో 5% సామాజిక అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయిస్తూ విద్య, ఆరోగ్యం, గృహనిర్మాణం, ఆకలి నివారణ, పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత రంగాల్లో సేవలు అందిస్తోంది. 1993లో స్థాపించబడిన మలబార్ గోల్డ్ & డైమండ్స్ 6.2 బిలియన్ డాలర్ల వార్షిక టర్నోవర్‌తో ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆభరణాల రిటైలర్‌గా నిలిచింది. డెలాయిట్ లగ్జరీ గూడ్స్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో 19వ స్థానంలో ఉంది. 13 దేశాల్లో కార్యాలయాలు, డిజైన్ కేంద్రాలు, ఉత్పత్తి యూనిట్లతో పాటు ఆన్‌లైన్ షాపింగ్ సదుపాయం కూడా కల్పిస్తోంది.

## కోడిపందేలపై పోలీసుల దాడి



- కోటపల్లిలో 9 మంది అదుపులోకి

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం కొల్లూరు గ్రామ గోదావరి పరివాహక ప్రాంతంలో జరుగుతున్న కోడిపందేలపై పోలీసులు శనివారం దాడి చేశారు. చెన్నూరు, మహారాష్ట్ర ప్రాంతాలవారు కూడా ఇందులో పాల్గొంటున్నారని ముందస్తు సమాచారం రావడంతో కోటపల్లి ఎస్ఐ రాజేందర్ సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. చమత్కారి శంకర్, పాలరపు సమ్మయ్య, గగ్గూరు తిరుపతి, రమేష్ మదనయ్య, గంట రవి, తుంగపిండి శ్రీకాంత్, ఆలం చిరంజీవి, పోలోజు సుధాకర్, సదయ్యలను అదుపులోకి తీసుకున్నారు. మరికొందరు అక్కడి నుంచి పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. దాడిలో నాలుగు సెల్‌ఫోన్లు, రెండు కోళ్లు, రూ.5,400 నగదును స్వాధీనం చేసుకున్నారు. కోడిపందాలు వంటి చట్టవ్యతిరేక చర్యల్లో పాల్గొనేవారిపై ఎలాంటి ఉపశమనం ఉండదని, కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాజేందర్ హెచ్చరించారు.



## అమృత్ 2.0 పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ప్రజలకు నిరంతరాయ త్రాగునీటి సరఫరా కోసం అమృత్ 2.0 పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శనివారం బెల్లంపల్లి పట్టణంలో తహసిల్దార్ కృష్ణ, మున్సిపల్ కమిషనర్ రమేష్‌తో కలిసి పనులను పరిశీలించారు. మిషన్ భగీరథ ద్వారా ఇళ్లకు నీటిని అందిస్తున్నామనీ, అమృత్ 2.0లో నిర్మిస్తున్న కొత్త ట్యాంకులు సరఫరాను బలోపేతం చేస్తాయని కలెక్టర్ తెలిపారు. పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు త్వరగా ప్రయోజనం చేకూరేలా చూడాలని సూచించారు. అదనంగా 2బీఆర్‌హెచ్ గృహనిర్మాణ పనులను పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ మనోజ్‌తో కలిసి 100 పడకల ఆసుపత్రిని పరిశీలించారు. వార్డులు, ల్యాబ్, మందుల నిల్వలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, జ్వర పీడితులకు ప్రత్యేక వార్డు, అవసరమైన మందుల నిల్వలు, ఆహార నాణ్యతపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. డయాలసిస్ సెంటర్‌లో కిడ్నీ బాధితులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ఆసుపత్రి ప్రహరీ గోడ పనులు చేపట్టాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిందిగా వైద్య సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విద్యుత్ ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు

- ఎస్ఈ ఉత్తమ్ జాడే

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ, రైతులు సహా వినియోగదారులకు విస్తృత అవగాహన కల్పిస్తున్నామని సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ్ జాడే తెలిపారు. ఈ దిశగా సర్కిల్‌లోని డి.ఇ (టెక్నికల్) అధికారులను సేఫ్టీ అధికారులుగా నియమించి చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. రైతుల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి "విద్యుత్ అధికారుల పొలం బాట" కార్యక్రమం కొనసాగుతోందని చెప్పారు. ఇప్పటి వరకు 5 కి.మీ. లూజ్ లైన్లు పునరుద్ధరించటం, 462 వంగిన పోల్స్ సరిచేయడం, 876 మధ్య స్థంబాలు నెలకొల్పడం, 332 లో లెవెల్ లైన్ క్రాసింగ్‌లు, 328 డబుల్ ఫీడింగ్ పాయింట్లు మార్పు వంటి పనులు పూర్తి చేశామని తెలిపారు. తక్కువ ఎత్తులో ఉన్న 131 డిటిఆర్ ప్లింత్‌ల ఎత్తు పెంచినట్లు వివరించారు. జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో భద్రతా బోర్డులు ఏర్పాటు చేసి, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి యుద్ధప్రాతిపదికన సరిచేస్తున్నామని తెలిపారు. నిరంతర శిక్షణ, భద్రతా చర్యలతో ప్రమాణాలను పెంచుతూ జీరో ప్రమాదాల లక్ష్యంతో అహర్నిశలు కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. విద్యుత్ సమస్యలు తలెత్తిన వెంటనే 1912 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని వినియోగదారులకు సూచించారు.

# భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి






- మండపాల వద్ద బందోబస్తు నిర్వహించాలి
- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

వినాయక చవితి సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని మంచిర్యాల ఎంఎల్ఏ ప్రేం సాగర్ రావు అన్నారు. శని వారం స్వగృహంలో సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని గణేష్ మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గణేష్ చతుర్థి మొదలుకొని, నిమజ్జనం వరకు మండపాల వద్ద గస్తీ ఉండాలన్నారు. కరెంట్ కేబుల్స్ కింద ఉండే మండపాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శానిటేషన్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ఎప్పటికప్పుడు పట్టణాన్ని శుభ్రంగా ఉంచాలన్నారు. అగ్నిపమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో పొలిసు శాఖ, విద్యుత్తు శాఖ, అగ్నిమాపక శాఖ, మున్సిపల్ శాఖ, రెవెన్యూ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే పీఎస్ఆర్ కోలుకోవాలని ప్రత్యేక పూజలు**

ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు త్వరగా కోలుకొని ప్రజాసేవలో పాల్గొనాలన్న ఆకాంక్షతో పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విశ్వనాథాలయంలో శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి, వాసవి మాతకు ప్రత్యేక పూజలు, శివాలయంలో అభిషేకం చేశారు. ఎమ్మెల్యే పీఎస్ఆర్ నేతృత్వంలో నియోజకవర్గంలో విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధి జరిగిందని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల నరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతిలు తెలిపారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం, ఇండస్ట్రియల్ పార్క్ వంటి అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు

## గ్రామాల్లో సింగరేణి వైద్య శిబిరాలు




**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

గ్రామీణ ప్రజల ఆరోగ్య రక్షణలో భాగంగా సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్టిపిపి) ఆధ్వర్యంలో వరుసగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. జైపూర్ మండలం లోని గంగిపల్లిలో శనివారం నిర్వహించిన శిబిలో రక్తపోటు, మధుమేహం, కంటి సమస్యల వంటి వ్యాధులపై పరీక్షలు చేసి, తగిన చికిత్సతో పాటు మందులు ఉచితంగా అందించారు. స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గత వారం పెగడపల్లిలో కూడా ఇలాంటి శిబిరం జరిగింది. గ్రామాల్లో వరుసగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజా ఆరోగ్యంపై సింగరేణి చూపుతున్న శ్రద్ధను అధికారులు ప్రస్తావించారు. గ్రామస్తులు కూడా ఇటువంటి శిబిరాలు తరచూ నిర్వహిస్తే ఆరోగ్య సంరక్షణకు మరింత ఉపయోగకరమని అభిప్రాయపడ్డారు.

### పేకాట స్థావరంపై దాడి

**శెనార్తి మీడియా, శంకరపట్నం :**

తాడికల్ గ్రామంలో శనివారం రాత్రి 10 గంటల సమయంలో పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు పట్టుకున్నారు. తాడికల్ గ్రామానికి చెందిన ములుగురి రవి, రాగుల రామస్వామి, జనగామ శ్రీనివాస్, కొరిమి ఉదయ్ కుమార్ జనగామ శ్రీనివాస్ కూల్‌డ్రింక్స్ షాపులో పేకాడుతుండగా పోలీసులు దాడి చేశారు. .ఈ దాడిలో రూ.5,370 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు, 52 ప్లేయింగ్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు కేశవపట్నం ఎస్ఐ శేఖర్ రెడ్డి తెలిపారు.